ఇలా ఎందరో...?

ఆడ, మగ కూలీలు మన్ను తవ్వి, గమేళాల్లోకెత్తి రోడ్డు కవతల పోస్తున్నారు. వాళ్ల ముఖాల నుంచి చెమట ధారలుగా జారి పడుతోంది. కొన్ని ఉద్యోగాలయితే బట్టలు నలగకుండా, ఒళ్లు అలియకుండా, మేకప్ చెదిరిపోకుండా ఫ్యాను క్రింద కూర్చుని కబుర్లు చెబుతూ కాలక్షేపం చేసినా నెలయ్యేసరికి కొన్ని వేల రూపాయలు చేతిలో పడతాయి. ఫైళ్ల మీద రాయడానికే అలసిపోయినట్లు, కొండంత భారం మోస్తున్నట్లు తెగ బాధ పడిపోతూ, రిలాక్సేషన్ కావాలని పదిసార్లు అటూ ఇటూ తిరుగుతూ, టీ తాగుతూ కాలం గడిపేస్తారు. మరి ఈ కూలీలు ఒక్క క్షణం సేదతీర్చుకునేందుకు ఆగితే మేస్త్రి ఊరుకోడు, యజమాని సహించడు.

యాదమ్మ ఉస్సురంటూ కూలబడి చీర చెంగుతో ముఖం తుడుచుకుంది. మిట్టమధ్యాహ్నం. అంతా కాళ్లూ చేతులూ కడుక్కొని క్యారేజీలు విప్పసాగారు. ఎండ నిప్పులు చెరుగుతోంది. పేగులు అరుస్తున్నాయి. యాదమ్మ మూట విప్పి గిన్నెమూత తీసింది. చూపు మసకబారుతోంది. ఓపిక సన్నగిల్లుతోంది. ఆకలి బాధ కన్నా కొడుకు దూరంగా వెళ్లిపోయాడన్న బాధ తినేస్తోంది. 'ఆడూ యీడనే ఉండి ఏదో పని చేసుకుంటే తనకి తోడుగుండేవోడు. కోడలింత ఉడకేసి పడేసేది. సుధ తొలి తనని బాగనే సూసేది. ఆనకేటయిందో సిరముర‌లాడేది. ఏమాటకామాటే అనుకోవాల. సుధ పప్పుశారు బాగా చేస్తది. అదంటే తనకి సేన యిట్టం. హు... దేనికయినా పేప్తముండాల' అనుకొని నిట్టూర్చింది.

* * *

కొడుకు మాటలు విని కొయ్యబారిపోయింది యాదమ్మ. తన కొడుకేనా యిట్టా మాట్టాడేది? ఏటయిందీడికి? "ఒరే పెబా నేనిన్నది నిజంకాదని సెప్పరా?" కొడుకు ముఖంలోకి ఆశగా చూస్తూ అడిగింది.

"లేదమ్మా... నిజంగానే అన్నానమ్మా"

యాదమ్మ గుండెలో సన్నగా బాధ. ఆమె కళ్లలో నీటిపొర. "ఒరే నాయనా, నేనా పెద్దదాన్నయాను. సూపు సరిగా ఆనదు. బగమంతుడి దయవల్ల ఏదో కష్టపడ్తన్నాను. నన్నొగ్గి ఎల్లిపోతావా? నేనెట్టా బతికేదిరా? అమ్మా సుధా నువ్వయిన సెప్పమ్మ" బతిమాలింది. సుధ మాట్లాడలేదు. ఆశచావక యాదమ్మ "ఓరి నా ముద్దుల కొడకా, పోనీ ఓ పిల్లోడినయిన నా కాడ ఉంచరా. కసింత తోడుగుంటడు" అంది. మొగుడెక్కడ ఒప్పేసుకుంటాడోనని సుధ ప్రభాకర్ ముఖంలోకి తీక్షణంగా చూసింది. ఆ చూపు యాదమ్మ దృష్టిని తప్పిపోలేదు. "లేదమ్మా ఎల్లాల. ఈలున్నపుడు ఒస్తునే ఉంటాం" ప్రభాకర్ సమాధానంతో యాదమ్మ ప్రాణం విలవిల్లాడింది. కొడుకంటే ఆమెకి ప్రాణం. ప్రభాకర్‌కి భార్య మాట వేదం. యాదమ్మకి తనీ ప్రపంచంలో ఒంటరిననిపించింది. తన పేగు తెంచుకొని పుట్టిన కొడుకు. ఆడే అంతా అని నమ్ముకున్న ఒక్క కొడుకూ పెళ్ళాం కొంగట్టుకొని ఊరొగ్గేసి, తన్నొగ్గేసి యెల్లిపోతన్నాడు.

కొడుకు, మనవలు, కోడలు ఎల్లిపోతుంటే యాదమ్మ గుండె బరువెక్కింది. మనవలను ముద్దెట్టుకుంది. వాళ్లు వెళ్లినవైపు చూస్తూ ఎంత సేపలా నిల్చుందో తెలియదు. రెండిళ్లవతల ఉన్న గౌరమ్మ పిలిచేవరకూ ఏదో ఆలోచనలో ఉంది. "ఏటి యాదమ్మా, కొడుకు కోడలు పిల్లలతో యాడకెల్తన్నారు" గౌరమ్మ ప్రశ్నకు

వి.ఎస్.ఆర్. మౌళి

యాదమ్మ భోరుమంది. కాస్సేపటికి తెప్పరిల్లి విషయం చెప్పింది. గౌరమ్మ కాస్సేపక్కడుండి యాదమ్మను ఓదార్చి వెళ్లిపోయింది.

* * *

యాదమ్మకి తన పాత రోజులు గుర్తొచ్చాయి. అప్పుడు పెనిమిటి సూరయ్య బతికున్నాడు. సూరయ్యకి పెద్ద సంపాదన లేకపోయినా ఏనాడూ యిబ్బంది పడకుండా హాయిగానే గడిపేవారు. ఏదో పనిచేసి కొద్దో గొప్పో తెచ్చేవాడు. తృప్తిగా ఉండేది. తనకు యిద్దరు మగపిల్లలు. ఒకాడ పిల్ల పుట్టినా ఎక్కువ కాలం బతకలేదు. చివరికి ప్రభాకర్ పుట్టాడు. ఆడ్ని అల్లారుముద్దుగా పెంచింది. ప్రభాకర్ బొద్దుగా బాగుండేవాడు. ఆడంటే సూరయ్యకీ ప్రేమే. కొడుకు సెనంకూడా తన్నొగ్గేవోడుకాదు. తను అప్పుడప్పుడు పనిసేసి కుసింత డబ్బులు తెస్తుండేది. నాలుగు డబ్బులు చేతిలో పడగానే సూరయ్యకి తాగుడలవాటయింది. అది తన కిట్టం ఉండేది కాదు. తనకి సేన బాధ కలిగింది. "ఏటయ్య కొత్తగా తాగొత్తన్నావు. నీకేటయినాది" యాదమ్మ మాటలు సూరయ్య తేలిగ్గా తీసుకున్నాడు. యాదమ్మ ఊరుకోలేదు. "ఇదిగో నిన్నే... అంతుసారుగుందేటా ఎదవమందు. ఉన్న యీ ఒక్క నలుసుగాడ్ని సదివించుకుంటే, ఆడికి నాలుగచ్చరం ముక్కలొత్తే ఆడి బతుకాడు బతుకుతాడు" అంది.

"ఎహె... ఏటే నీ గోల?"

యాదమ్మ ఆశ్చర్యపోయింది. అంతకంటె రెండింతలు బాధపడింది. తనమావేనా యిట్టా మాట్టాడుతున్నాడు? ఏటయిందీడికి?

మానవుని తొడలోని ఎముక కాంక్రీట్ కంటే గట్టిగా ఉంటుంది

"అయినా నీకీ పాడలవాటేటి, బంగారం లాటోడివి. బతుకు బుగ్గిసేసుకుంటన్నావు".

"నోరుముయ్యెహె. ఒక్కపాలి ఏదో కసింత ఏస్కున్నాను"

యాదమ్మ తగ్గలేదు. "ఈయేల ఒక్కపాలే అంటావు. రేపటి నుంచి అదే అలవాటయి పోద్ది" అపుడింకేదో సెబుతావు" అంది.

సూరయ్యకి చిర్రెత్తిపోయింది. "అవునే... తాగుతానే... నా యిట్టం" అన్నాడు. అన్నట్లుగానే సూరయ్య రోజూ తాగొస్తున్నాడు. యాదమ్మ కొడుకుని పట్టుకొని ఏడుస్తోంది. సూరయ్య రానురాను ఇంటి విషయం పట్టించుకోవడం మానేశాడు.

"ఇదిగో నిన్నే... ఇంట్ల బియ్యంలేవు. జావ కాద్దామంటే నూకలు కూడా లేవు" అంది యాదమ్మ.

"ఏటి బియ్యంలేవా... అపుడే అయిపోనాయేటి... సెత్... ఇయ్యాల బొమ్మిడాలు సింత సిగురెట్టి సెయ్యి" అన్నాడు ముద్దగా.

"ఏటి సెన్నల్లో సెట్లు మొలిచినయ్యా. దరిజాసెవాయిస్తన్నావు... బియ్యం లేవురో మొగుడా అంటే రుసులు కావాలా? ఓయబ్బ! తెచ్చిన డబ్బంత తాగి తగలేసి కూడు బుక్కడానికి కొంపకొచ్చి పీకలనిండ తిని తొంగుంతన్నావు. పెల్లం, బిడ్డలేటి తిన్నారో లేదో నీకేటవసరంలేదు" అంది యాదమ్మ.

సూరయ్యకి సురసురమంది. యాదమ్మకి నాలుగుతగిలించాడు. యాదమ్మ ఏడుపులంకించుకుంది. ప్రభాకర్ బెంబేలెత్తి తనూ ఏడవసాగాడు. యాదమ్మకి పెబుత్వం మీద కోపమొచ్చింది. కల్లు, సారా, అయేయో మందులమ్మే వాళ్ళ మీద ఉక్రోషం కలిగింది. అయినా



ఏం చేయగలదు తను? "ఓర్నాయనో నేనేటి సేద్దునో. ఈ ముదనష్టపు మందు సుబ్బరంగ వున్నోల్లని రాచ్చసులుగ సేస్తంది. ఈల్లేమో తాగి ఇల్లు గుల్లసేస్తున్నారు" అంది ముక్కు చీది. ప్రభాకర్ భయం భయంగా తల్లిని వాటేసుకొని బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాడు.

అటుగా వచ్చిన గౌరమ్మ యాదమ్మని చూసి ఎందుకేడుస్తున్నావని అడిగింది. యాదమ్మకి తలకొట్టేసినట్లయింది. ఏంసెప్పాల. యాదమ్మ చెప్పింది విని గౌరమ్మ "నే రేసను షాపుకి పోయొచ్చిన. బియ్యం లేవట, కిరసనాయలు లేదట, నీకాడుందేమో అడుగుదామని ఒచ్చిన" అంది.

యాదమ్మ "నా కాడా? ఆడి జిమ్మడ. తెచ్చిన కూలి డబ్బులు తాగడానికే తగలేస్తంటే సరుకులు యాడకెల్లి తేవాల? నానీ సంసారం ఎలా సెయ్యాల?" అంది. ఎలచ్చన్లపుడు అది సేత్తాం యిది సేత్తాం అని ఓటేయించుకుంటారు మాయదారోల్లు. మన బతుకులు అద్దాన్నమయిపోనాయి" అంది గౌరమ్మ.

* * *

తెల్లవారేసరికి ఆ వార్త గుప్పుమంది. ఎవరి నోటవిన్నా అదే విషయం. రాత్రంతా భర్త రాకకోసం చూసిన యాదమ్మకి ఏ తెల్లవారు ఝామునో కాస్త కునుకు పట్టింది. బయట అలికిడికి లేచి వచ్చింది. గౌరమ్మ గుండెలు బాదుకొంటూ ఏడుస్తోంది. ఇంతలో ఓ వ్యాను వచ్చి ఆగింది. అందులో నుంచి ఒకయిదుగుర్ని మోసుకొనితెచ్చి పడేశారు. వారిలో సూరయ్య శవం, గౌరమ్మ భర్త శవం ఉన్నాయి. అంతా గొల్లుమన్నారు. రాత్రి వాళ్లంతా చిత్తుగా తాగేరు. వాళ్లు తాగింది కల్తీ సారా కావడంతో వాంతులయితే హాస్పిటల్‌లో చేర్చారు. కానీ అప్పటికే పరిస్థితి విషమించింది. ఒక్కరూ బతకలేదు. ప్రభాకర్ తల్లి వద్దకు పరిగెత్తాడు యాదమ్మ వాడ్ని పట్టుకొని "ఒరే నాయినా సూర్డా... మీ అయ్య ఎంత గోరం సేసినాడో. ఈ దిక్కుమాలిన తాగుడు మీ అయ్యని సంపేసిందిరా" అంది

వెక్కుతూ. ప్రభాకర్ రాగం ప్రారంభించాడు. ఆ దృశ్యం చూసి అక్కడి వారి గుండె ద్రవించి పోయింది.

* * *

భర్తపోయినప్పటి నుంచీ యాదమ్మ కొడుకుని మరీ ముద్దుగా, ప్రేమగా పెంచింది. తనకి శక్తున్నంత వరకూ ఆ ఊర్లోనే చదివించింది. తన మంచితనంతో ఓ పెద్ద యింట్లో పని సంపాదించింది. కొడుక్కు ఓ ప్రయివేట్ ఆఫీస్‌లో అటెండర్ ఉద్యోగం వేయించింది వాళ్లనీ వీళ్లనీ బతిమాలి. ఓ పిల్లను చూసి కొడుక్కి పెళ్లి చేసింది. ఇద్దరు కొడుకులు పుట్టేవరకూ సుధ అత్తగారిని బాగానే చూసింది. క్రమంగా సుధలో మార్పు రాసాగింది. అత్తని చులకన చేయసాగింది. భార్య తన తల్లిని తిడుతున్నా, అవమానిస్తున్నా ప్రభాకర్ పట్టించుకోలేదు. భార్యని మందలించలేదు. సుధ అత్తకి తిండి కూడా సరిగ్గా పెట్టడం లేదు. యాదమ్మ మనస్సు చివుక్కుమంది. తనకి ఏదో తినాలని జిహ్వా లాగుతున్నా కోడలినోటికి జడిసి ఊరుకునేది. ఇపుదున్నపళంగా కొడుకు నిర్ణయం విని విలవిల్లాడింది యాదమ్మ మనసు.

* * *

గతం నుంచి బయటపడింది యాదమ్మ. చైత్రమాసం ఎండ వేపుకు తింటోంది. అపుడపుడూ వస్తూంటామని చెప్పిన కొడుకు జాడ లేదు. యాడున్నాడో తెల్దు. రోజూ ఒస్తాడని చూస్తోంది. పనిమీద ధ్యాస లేక సరిగా చేయలేకపోతుంటే పన్లో నుంచి తీసేసారు. కుడి పాదం మీద కురుపు లాగేస్తోంది. కాలంతా ఒకటే బాధ. ఏవో పసర్లు, అదీ యిదీ పోసింది. బాధ తగ్గలేదు. కాలు వాచింది. ఒకటే సలుపు, పోటు. ఆ రోజు ఇద్దరు నర్సులు, కొంతమంది సిబ్బంది ఏవో మందులు తీసుకొని వీధివీధీ తిరుగుతున్నారు. పోషకాహారం, ఆరోగ్య రక్షణ గురించి ఏవో సలహాలు చెప్తారట. వాళ్లు ఏవో మాత్రలు యిచ్చి, పోషకాహారం బాగా తినాలని ఉచిత సలహాలు చెప్తున్నారు.

“అంటే ఏటి?” అడిగేరు కొందరు.

“మీ ఆరోగ్యం బాగుండాలంటే ఫలానా ఆహారం తినాలి. వాటిలో విటమిన్లుంటాయి”

నిత్య రక్తదానం

“మా పార్టీవాళ్ళు రేపు రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. మీరు కూడా రావాలి! వచ్చి రక్తదానం చేయాలి” – అన్నాడు ఓ పార్టీవాడు ఓ అప్పారావుతో.

“నేను నిత్యం రక్తదానం చేస్తున్నాను. మా పేటలో దోమలు ఎక్కువ! వున్న రక్తం వాటికే సరిపోవడం లేదు! మీ శిబిరంలో ఏం ఇవ్వమంటావ్?” అని అడిగాడు అప్పారావు.

పార్టీ మనిషి మరోమాట మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

ఏదేదో చెప్పుకుపోతున్నారు. ఓ యువకుడు ఫకాల్న నవ్వాడు. అంతా నవ్వసాగారు.

"బలేవోరండి. మేం అన్నం తిని ఎన్నాళ్లయిందో తెల్సా? ఓ పూట తిండి దొరికితే రెండు రోజులు తిండే ఉండదు. మీరు సెప్పినవెట్టగొస్తయి?" అన్నాడాయువకుడు. "ఇవన్నీ మాకెందుగ్గాని, మా కడుపుకి బువ్వ గావాల. పెడతారా బాబూ?" అడిగాడో వృద్ధుడు. నర్సులు, సిబ్బంది ముఖాలు చూసుకున్నారు. వాళ్లలో వాళ్లేదో మాట్లాడుకొని తిరుగుముఖం పట్టారు.

యాదమ్మ నిలబడాలని ప్రయత్నించింది. ఆకలి, దాహం. అతికష్టం మీద తడబడుతూ ఒక్కొక్క అడుగూ వేయసాగింది. అడుగుతీసి అడుగు వేయడం గగనమవుతోంది. కాలు రివ్వున లాగేస్తోంది. ప్రాణం కడంటిపోతోంది. ఆయాసంతో రొప్పుతోంది. యాదమ్మ ఓ యింటి ముందాగింది. "తల్లీ పేనం లాగేస్తుంది. కసిన్ని గంజినీళ్లు పొయ్యమ్మా" అరిచింది లేని శక్తిని తెచ్చుకొని. ఆ కంఠంలో వేడికోలు, వేదన హృదయమున్న ఎవరికయినా జాలి కలిగిస్తాయి. తలుపులు తెరచి ఉండడం వల్ల లోపలేం జరుగుతున్నదీ రోడ్డుమీదకి కనిపిస్తోంది. ఆ యింటి ఇల్లాలు కూతురికి భోజనం పెడుతోంది. లోపల నుంచి వేడి ఉల్లిపాయ పులుసు వాసన ముక్కుకి తాకడంతో యాదమ్మ ఆకలి రెట్టింపయింది. లోపల కంచాల చప్పుడు. యాదమ్మ కడుపులో పేగుల అరుపులు. ఆశగా లోనికి చూస్తోంది. తల్లి "ఒసే... ఇదిగో ఈ తెలకపిండి ముద్దనంజుకో. సేనా బాగుంటది" అంటూ కంచంలో వేసింది. యాదమ్మ జిహ్వ లాగేస్తోంది. అభిమానం చంపుకొని మళ్లీ అడిగింది. ఆ యింటి ఇల్లాలు కసిరి దభీమని తలుపు మూసింది. యాదమ్మ మనస్సు చివుక్కుమంది. తను అడుక్కు తినేదా?

యాదమ్మ ఈంగ్ర పడుతూ అడుగులేస్తోంది. ఒళ్లంతా నొప్పులు. కడుపుమంట, ఓ ప్రక్క కాలుమంట. మరో వైపు గొంతెండిపోతోంది. నరాలు లాగేస్తున్నాయి. నాలుక పీక్కుపోతోంది. కళ్లు తిరుగుతున్నాయి. తనింటికేసి ఒక్కొక్క అడుగు వేస్తోంది. ప్రక్కనే ఉన్న పేడ కుప్ప నుంచి చేతి నిండా పేడ తీసి మండుతున్న పుండు చుట్టూ రాసింది. చల్లగా అనిపించింది. మెల్లగా యిల్లు చేరి అరుగుమీద కూర్చొని గోడకి చేరబడి కళ్లు మూసుకొంది.

నీరసంగా కళ్లు తెరిచిన యాదమ్మకి తనింట్లో ఎవరో ప్రవేశించినట్లనిపించింది. తనింట్లో దొంగ ప్రవేశించాడా? అయినా తనకాడేటుంది? తినడానికి బువ్వే లేదు. నీరసంగా నవ్వుకుంది. కొడుకు, కోడలొచ్చారు. మరి మన వాళ్ని తీసుకొచ్చేరా? ఆల్లెంత పెద్దోల్లయ్యేరో? ఎవురూ అవుపడరేటి? చెవులు రిక్కించింది. ఆ సప్పుడు వంట గది నుంచే. సూపంటే మందగించింది. సెవుడు రాలేదు. ముక్కెగబీల్చింది. పప్పులుసు వాసన లాగుందే... నోరూరింది. తన కోడలికి తనంటే ఎంతపేమ? మరికాసేపట్లో సుధ తనని బువ్వ తినడానికి పిలుస్తుంది. ఇంక ఆగలేమన్నట్లు పేగులరుస్తున్నాయి.

అయినా తన పిచ్చిగాని తనకర్మకి తన్నొగ్గేసెల్లిపోయిన కొడుకు, కోడలు యింతదాకా ఒక్కపాలయినా రాలేదు. ఓ కారుడుముక్కయినా రాయలేదు. అసలెక్కడున్నారో, ఆడి కోసం ఎదురు సూసిందే గానీ ఆడికి తనక్కర్లేదు. యాదమ్మ ఎండిన పెదాలమీద శుష్కమైన చిరునవ్వు. ఆ నవ్వులో జీవం లేదు, మెరుపు లేదు. ఆమెకి చాలా అస్థిమితంగా ఉంది. నిస్త్రాణగా పక్కకి వాలిపోయింది. ●